క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు


అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలో పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం అనంతరం సుగంధ పుష్పాలతో విశేష అలంకరణతో స్వామివారికి పూలంగి సేవ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగానే ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

బాలసదనంలో దుప్పట్ల పంపిణీ


దుప్పట్లను పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పరిగి: పట్టణ కేంద్రంలోని బాలసదనంలోని అనాథ చిన్నారులకు ఆదివారం స్థానిక బాలుర నంబర్–2 ఉన్నత పాఠశాలకు చెందిన 2002–03 పదో తరగతి విద్యార్థులు దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. బాలసదనంలోని విద్యార్థులకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. విద్యార్థులకు ఎలాంటి సాయం, సమస్యల పరిష్కారం కావాలన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, బాలసదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కిష్టయ్య త్యాగం మరువలేనిది

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


పోలీస్ కిష్టయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

పరిగి: తెలంగాణ మలిదశ పోరులో అమరుడైన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహనీయుల విగ్రహాల వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ చేసిన త్యాగం మరువలేనిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కిష్టయ్యముదిరాజ్ జయంతి, వర్ధంతి వేడుకలను అధికారికంగా నిర్వహించి, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా కన్వీనర్ ముకుంద నాగేష్, మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు అందుకున్న సునీత



తాండూరు టౌన్: అమ్మ ఆదరణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సునీతకు రూరల్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డు దక్కింది. బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(బీఐసీసీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. సామాజిక సేవా కార్యక్రమాలు, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా అనేక మందికి శిక్షణ ఇచ్చినందుకుగాను ఆమెను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన మెప్మా పీడీ, అవార్డుకు ఎంపిక చేసిన బీఐసీసీఐ వ్యవస్థాపకులు నారాయణకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు.

కారుమబ్బులు.. రైతన్నల గుబులు

ఆకాశంలో కమ్ముకున్న నీలి మేఘాలు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే సమయానికి వాతావరణ మార్పులతో మదనపడుతున్నారు. అనుకోని ఉపద్రవం ఎదురుకాక ముందే వరి కోతలను త్వరితగతిన పూర్తి చేయాలని రైతన్నలు సంకల్పించారు.

- వర్ష సూచనతో కలవరం
- జోరందుకున్న వరి కోతలు
- హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్


గోకఫసల్‌వాద్‌లో వరి చేను కోస్తున్న హార్వెస్టర్

దౌల్తాబాద్: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వరి కోతలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీంతో పొలం కోసే యంత్రాల(హార్వెస్టర్లు)కు డిమాండ్ పెరుగుతుంది. అధికమొత్తంలో వెచ్చించి కోతలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో రైతులు తమ పంటను ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు తరలిస్తూ విక్రయించుకుంటున్నారు.

అన్నదాతల ఆందోళన

కోత దశకు వచ్చిన వరి పంటలకు కారు మబ్బుల గుబులు చుట్టుకున్నాయి. రెండు రోజులుగా ఆకాశంలో మబ్బులు ఏర్పడ్డాయి. దీంతో రైతులు పంట కోసేందుకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. హార్వెస్టర్ల కోసం కర్షకులు పరుగులు తీస్తున్నారు. వాతావరణం అనుకూలించాలని కోరుతున్నారు.

12 వేల ఎకరాల్లో సాగు

మండలంలో 33 పంచాయతీల పరిధిలో మొత్తం 12 వేల ఎకరాల్లో వరిసాగు చేసినట్లు వ్యవసాయధికారులు తెలిపారు. ప్రస్తుతం వరి కోతలు ప్రారంభంకాగా ఇప్పటివరకు మండలంలో 40నుంచి 50శాతం వరకు వరి కోతలు పూర్తయినట్లు వ్యవసాయధికారులు పేర్కొన్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో వరి నాట్లు కొంత ఆలస్యం కావడంతో కోతలు ఇప్పుడే ప్రారంభమయ్యాయి. వారం రోజుల తర్వాత కోతలు జోరందుకునే అవకాశం ఉంది. మండల వ్యాప్తంగా సాగు చేసిన పంటల ధాన్యం దిగుబడి సేకరించేందుకు పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. చాలా మంది రైతులు వరి పంట కోసిన తర్వాత నూర్పిడి చేసి ఆరబోయకుండా కేంద్రాలకు తీసుకురావడంతో మద్దతు ధర పొందలేక నష్టపోతున్నారు. అయితే ధాన్యానికి మద్దతు ధర లభించాలంటే తప్పనిసరిగా పలు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయధికారులు చెబుతున్నారు.

కోత పూర్తయింది



యాసంగిలో నాకున్న నాలుగు ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. రెండు రోజుల క్రితం పొలం కోత పూర్తి చేశా. ఆకాశంలో కారు మబ్బులతో గుబులురేగుతుంది. కొనుగోలు కేంద్రానికి తరలించా. నిబంధనల ప్రకారం తేమశాతం రాగానే పంటను విక్రయిస్తాం. – జనార్దన్‌రెడ్డి, నందారం, రైతు

పక్షం రోజుల్లో పూర్తి



ఈ యాసంగిలో 12వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటికీ 50 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. మరో 15 రోజుల్లో వరి కోతలు పూర్తయ్యే అవకాశం ఉంది. రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకొని మద్దతు ధర పొందాలి.

– లావణ్య, ఏఓ, దౌల్తాబాద్

కార్తీకం.. అమావాస్య ప్రత్యేకం


కుల్కచర్ల: స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

కుల్కచర్ల: కార్తీకమాసం చివరి అమావాస్య పురస్కరించుకుని ఆదివారం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. పరిగి సీఐ శ్రీనివాస్, కుల్కచర్ల ఎస్ఐ అన్వేష్‌రెడ్డిలు విచ్చేసి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగింపు వేడుకలు

దుద్యాల్: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న శ్రీ పతంజలి యోగాశ్రమ తపోవనంలో కార్తీకమాస ముగింపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 40 రోజులుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ముగింపు వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన చతుర్వేత పారాయణ పూర్ణాహుతికి విశేష స్పందన లభించింది. ముఖ్య వక్తలుగా ఆచార్య హరిప్రసాద్, ఓం ప్రకాశ్ యజ్ఞమార్య, రఘోత్తమాచార్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై హోమాలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు.

అలంకరణలో రామలింగేశ్వర స్వామి

తాండూరు రూరల్: జినుగుర్తి గ్రామ శివారులో ఉన్న శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి దీపారాధన చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


దుద్యాల్: హోమం నిర్వహిస్తున్న భక్తులు

ధర్మాన్ని కాపాడుకోవాలి

ఆధ్యాత్మికవేత్త భాస్కరయోగి


ప్రవచనాలు చెబుతున్న భాస్కరయోగి

అనంతగిరి: ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ భాస్కర యోగి అన్నారు. ఈ మేరకు ఆదివారం వికారాబాద్ పట్టణంలోని రామమందిరంలో ఆధ్యాత్మిక సేవా మండలి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు కొనసాగిన రుద్రాభిషేక మహోత్సవం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక ప్రవచనంలో భాస్కరయోగి మాట్లాడుతూ.. భక్తితోనే ముక్తి సాధ్యమన్నారు. మనకు ఎన్ని దైవాలు ఉన్నా దైవత్వం ఒక్కటేనన్నారు. సనాతన ధర్మం నేడు ప్రపంచంలో ఎక్కడ చూసిన ఏకత్వ భావనను అందించారన్నారు. మన ధర్మం ఎంతో గొప్పదని అన్నారు. ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సాయంత్రం స్వామి వారి శోభాయాత్ర పట్టణ ప్రధాన వీధుల గుండా భక్తిశ్రద్ధలతో కొనసాగింది. స్వామి వారిని మాజీ ఎమ్మెల్యే ఆనంద్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో సేవా మండలి ప్రతినిధులు టి.రాజు, వెంకట్, సుభాశ్ పంతులు, భోగేశ్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

‘సింహగర్జన’కు తరలిన నేతలు


పరిగి: మహనీయుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న మాల నాయకులు


దుద్యాల్: హైదరాబాద్ వెళ్తున్న మాల నేతలు


తాండూరు టౌన్: సభకు వెళ్తున్న మాలలు

పరిగి: మాలలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన ఫలాలు అందాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య అన్నారు. ఆదివారం నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన మాలల సింహగర్జన సభకు పరిగి నుంచి భారీగా తరలి వెళ్లారు. ముందుగా పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించి మహనీయుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.

తాండూరులో..

తాండూరు టౌన్: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మాలల సింహగర్జన సభకు ఆదివారం తాండూరు నియోజకవర్గంలోని మాలలు తరలివెళ్లారు. అంబేడ్కర్ చౌక్ నుంచి ఇందిరాచౌక్ వరకు ర్యాలీ నిర్వహించిన అనంతరం సభకు తరలివెళ్లారు.

చలో హైదరాబాద్‌కు నేతలు

ధారూరు: చలో హైదరాబాద్ కార్యక్రమానికి ధారూరు మండలం నుంచి మాల మహానాడు నాయకులు ఆదివారం తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాలలు అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి సింహగర్జన సభకు వెళ్లారు. కార్యక్రమంలో నేతలు రాజు, చెన్నయ్య, మహేశ్‌కుమార్, శివరాజు, గోపాల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: సింహగర్జన సభకు మండలానికి చెందిన మాలలు ఆదివారం తరలివెళ్లారు. బయలుదేరిన వారిలో రాములు, అంజిలయ్య, బందయ్య, అనంతయ్య, వెంకటయ్య, బుగ్గప్ప, దస్తప్ప, మొగులప్ప, ఇస్తప్ప, మోహన్ తదితరులున్నారు.

నేడు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పర్యటన

తాండూరు రూరల్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సోమవారం పర్యటిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఓగిపూర్, కరన్‌కోట్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్, గౌతపూర్, చెంగోల్, చింతమణిపట్నం, పర్వాతపూర్, చెన్‌గేస్‌పూర్, కోనాపూర్, ఎల్మకన్నె, వీరిశెట్టిపల్లి తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు.

గుల్బర్గా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు

మోమిన్‌పేట: గతేడాది ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున గడ్డం ప్రసాద్‌కుమార్ గెలవాని గుల్బర్గా దర్గాలో మండల నాయకులు మొక్కుకున్నారు. ఈ మేరకు ఆయన ఎన్నికలలో గెలవడమే కాకుండా రాష్ట్ర శాసనసభ అధిపతి కావడంతో.. ఆదివారం ఉదయం కాంగ్రెస్ నేతలు సుభాష్ గౌడ్, రాజు, శానవాజ్ హుస్సేన్, పాషా తదితరులు గుల్బర్గాలోని ఖాజ బందానావజ్ దర్గాలో మొక్కులు చెల్లించుకున్నారు.

‘రాజకీయ లబ్ధి కోసం బీఆర్‌ఎస్ కుట్రలు’

ధారూరు: తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ఆరోపించారు. ఆదివారం ధారూరులో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు ఇలాగే చేస్తుంటే ప్రజల్లో చులకనవుతారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యావ్యవస్థకు కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాడైన ఏడాదిలోనే విద్యార్థులకు కాస్మొటిక్, మెస్ చార్జీలు పెంచి 10 లక్షల మందికి లబ్ధి చేకూర్చిందన్నారు.

బాలమల్లేశ్ మృతి బాధాకరం

కొడంగల్ రూరల్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్.బాలమల్లేశ్ మృతి అత్యంత బాధాకరమని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గంటి సురేశ్ విచారం వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్‌లో కార్యకర్తల సందర్శనార్థం ఆయన భౌతికకాయానికి నివాళులర్పించినట్లు సురేశ్ తెలిపారు. విద్యార్థి దశ నుంచే బాల మల్లేశ్ అలుపెరుగని పోరాటం చేశారని గుర్తు చేశారు.

చిన్నారులకు సరుకుల అందజేత

కొడంగల్ రూరల్: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామంలో ఇద్దరు చిన్నారులకు అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సరుకులను అందించారు. గ్రామానికి చెందిన నవీన్, సురేష్‌ల తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోవడంతో బంధువుల దగ్గర ఉంటున్నారు. అమ్మానాన్న ఫౌండేషన్ ఫౌండర్ ప్రవీణ్‌కుమార్, సభ్యులు గ్రామానికి వెళ్లి చిన్నారులకు కిరాణ సామగ్రితో పాటు దుస్తులను అందజేశారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్

బీజేపీ వికారాబాద్ కో–ఆర్డినేటర్ వడ్ల నందు


బైక్ ర్యాలీలో మాట్లాడుతున్న వడ్ల నందు

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇస్తామని అన్నదాతలను మోసం చేసిందని బీజేపీ వికారాబాద్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వడ్ల నందు ఆరోపించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని ఆదివారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఏక కాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి, కొంత మందికే మాఫీ చేసి చేతులు దులుపుకోవడం దారుణమన్నారు. ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. అధిక వర్షాలు కురిసి పంటలు దెబ్బతింటే కేవలం పార్టీకి చెందిన సానుభూతిపరులకే పరిహారం అందించారని ఆరోపించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2500లు, పింఛన్లు రూ.2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని దగా చేశారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌లకు అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగానే మిగిలాన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సదానంద్‌రెడ్డి, లక్ష్మారెడ్డి ఉన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం

దౌల్తాబాద్: ఎయిడ్స్ రోగులపై వివక్ష చూపకుండా వారిని ఆదరించాలని వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎయిడ్స్ డే ను పురస్కరించుకుని అవగాహన కల్పించారు. ఎయిడ్స్ వ్యాధి అంటు రోగం కాదని, తగు జాగ్రత్తలు ప్రాథమిక స్థాయిలో తీసుకోవడం వల్ల ఎయిడ్స్ నుంచి బయట పడొచ్చని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సంతోష్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

మర్పల్లి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2005–06 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సన్మానించారు. సందర్భంగా అలనాటి గురువులు చెప్పిన పాఠాలు, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని సంతోషంగా గడిపారు.


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఏడాది సంబురం.. విద్యార్థుల వ్యాసం


బొంరాస్‌పేట: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు


యాలాల: విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ తదితరులు

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావొస్తున్న తరుణంలో ప్రజాపాలన– ప్రజా విజయోత్సవాల పేరిట సర్కారు సంబురాలు నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను ఉపాధ్యాయులు చేపట్టారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ఆయా ఎంఈఓ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి చిన్నారులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ‘పునరుత్పాదక ఇంధన వనరులు’ అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన 80 మంది విద్యార్థులు వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. పోటీల అనంతరం ప్రతి మీడియంకు సంబంధించి ఇద్దరు చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్యామలమ్మ, మురళీధర్, హాస్టల్ వార్డెన్ హన్మంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు డి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్–1 ఉన్నత పాఠశాలలో..

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్1 ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా గెలుపొందిన వారికి రెండు విభాగాల్లో బహుమతులను అందజేశారు.

బంట్వారంలో..

బంట్వారం: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం బంట్వారం, కోట్‌పల్లి మండల కేంద్రాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓలు చంద్రప్ప, వెంకటేశ్వర్‌రావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాలలోని పాఠశాలలలో ప్రభుత్వ పథకాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలను ఆదివారం నిర్వహించారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 63 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలను ఎంఈఓ విజయరామరావు, ఉపాధ్యాయులు మల్లప్ప, అభయ్ కుమార్, శ్రీనివాస్, సుధాకర్ రావు, రవీందర్, రమేశ్, రాధిక, జ్యోతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

దోమలో..

దోమ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులందరికి ఎంఈఓ వెంకట్ బహుమతులను ప్రదానం చేశారు.

యాలాలలో..

యాలాల: ప్రజా విజయోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఎంలు మహిపాల్‌రెడ్డి, సుధాకర్, సంగమేశ్వర్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల వనరుల కేంద్రం ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులను అందజేశారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మండల స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, మల్లయ్య, రతన్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.


ధారూరు: వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థినులు